ప్రజాశక్తి
శుక్రవారం 16 డిసెంబర్ 2022 5
అనంతపురం



ఉద్యోగాల నియామకంలో దళారులను నమ్మొద్దు : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం న్యాయశాఖ, పోలీసుశాఖలలో భారీ ఎత్తున ఉద్యోగ నియామకాలు జరుపుతోందని, దీనికి సంబంధించి నిరుద్యోగులు దళారులను నిమ్మిమోసపోవద్దంటూ ఎస్పీ డా॥ఫక్కీరప్ప గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. నిరుద్యోగాలను నిలువునా ముంచేందుకు దళారులు, మోసగాళ్లు సిద్ధంగా ఉన్నారన్నారు. ఉన్నతాధికారులు, కీలక నాయకులు బాగా తెలుసు అని... పరిచయాలు ఉన్నాయంటూ నమ్మబలుకుతూ డబ్బులు గుంజుకుని మోసాలకు పాల్పడే అవకాశముందన్నారు. ఇలాంటి మోసగాళ్లు, దళారులను నమ్మరాదన్నారు. ఏ ప్రభుత్వ ఉద్యోగమైనా ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహిస్తారన్న విషయాన్ని నిరుద్యోగులు, తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. ఎవరైనా ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడితే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. దళారులు, మోసగాళ్లు ఎవరినైనా సంప్రదిస్తే డయల్ – 100 లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలన్నారు.



ముంచేసిన 'సంకల్ప సిద్ధి'

కమీషన్ల ఆశ చూపి 'సంకల్ప సిద్ధి' ప్రజలను ముంచేసింది. కోట్లాది రూపాయలను వసూలు చేసుకుని ఆ సంస్థ ప్రతినిధులు ఉడాయించారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఇందులో డిపాజిట్లు చేసిన బాధితులు తమకు న్యాయం చేయండి అంటూ పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో చూస్తే కళ్యాణదుర్గం డివిజన్ ప్రాంతంలోనే కోట్లాది రూపాయలను డిపాజిట్లు పెట్టి ప్రజలు నష్టపోయారు. ఈ ప్రాంతంలో సంకల్పి సిద్ధి ఏజెంట్లు, బాధితులు ఎక్కువగా ఉండడంతో పోలీసులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా సంకల్ప సిద్ధి బాధితులు ఎవరైనా ఉంటే కళ్యాణదుర్గం పట్టణ పోలీసు స్టేషన్‌లో తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయాలంటూ గురువారం నాడు డీఎస్పీ శ్రీనివాసులు విలేకరులకు తెలియజేశారు.

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

సంకల్ప సిద్ధిని మొదలు పెట్టిన సమయంలో దీనికి పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. మొదట్లు డిపాజిట్లకు వెంటవెంటనే కమీషన్లను అందించి చెల్లింపులు చేశారు. దీంతో చాలా మంది దీనిపట్ల ఆకర్షితులు అయ్యారు. ముఖ్యంగా కొందరు ఉద్యోగులు దీనిలో పెట్టుబడులు పెట్టడంతో పాటు, ఏజెంట్లుగా మారి ప్రజలతో డబ్బులు వసూలు చేశారు. ఉద్యోగులే మార్టులో లక్షలాది రూపాయాలు వెచ్చించడంతో వారిని నమ్మి సామాన్య ప్రజలు సైతం పెట్టుబడులు పెట్టారు. ఉన్నఫలంగా మార్ట్ యాప్ బంద్‌కావడంతో ఆసలు మోసం బట్టబయలైంది. సంకల్ప సిద్ధి మార్టు నిర్వహకులను విజయవాడలో అరెస్ట్‌చేసి జైలుకు పంపారు. దీంతో బాధితులు తామంటేతాని, ఏజంట్లను నమ్మి పెట్టుబడులు పెట్టామని పోలీసులను ఆశ్రయించారు. ఇలా ఉమ్మడి జిల్లాలో చూస్తే ఒక్క కళ్యాణదుర్గం డివిజన్ ప్రాంతంలోనే సంకల్ప సిద్ధి సుమారు రూ.50కోట్ల వరకు లావాదేవీలు నడిపినట్లు తెలుస్తోంది. ప్రారంభంలో కొంతమంది ఉద్యోగస్తులు ఏజెంట్లు మారి లక్షలాది రూపాయాలు అర్జించి విలాసాలు ప్రదర్శించారు. వీరిని చూసి సామాన్యులు ఇందులో పెట్టుబడులు పెట్టారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగులే ఇందులో వందలాది మంది ఏజెంట్లుగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు ఉద్యోగులు గుట్టుచప్పుడు కాకుండా వారు డబ్బులు కట్టించుకున్న వారికి ఆ సొమ్మును వెనక్కు ఇచ్చేసినట్లు సమాచారం. మరికొందరు తామూ మోసపోయామని ఈ పరిస్థితులు మేము ఏమీ చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం కళ్యాణదుర్గం పట్టణంలో నివాసముంటున్న ఓ ఉపాధ్యాయుడి ఇంటి వద్ద వందలాది మంది బాధితులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తమ డిపాజిట్ మొత్తాన్ని వెనక్కు ఇవ్వాలంటూ నిలదీశారు. తమకు న్యాయం చేయాలంటూ పోలీసు స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు. బాధితులు అందరితోనూ పోలీసులు మాట్లాడి డిపాజిట్లకు సంబంధించిన తగిన ఆధారాలను తీసుకుని కేసులు నమోదు చేస్తున్నారు.

పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు

సంకల్ప సిద్ధి మార్ట్ బోర్డు తిప్పేసిన తరువాత ఒక్క కళ్యాణదుర్గం ప్రాంతంలోనే వేలాది మంది బాధితులు రోడెక్కారు. తమకు న్యాయం చేయండి అంటూ పోలీస్ స్టేషన్లను ఆశ్రయించారు. సంస్థకు చెల్లించిన మొత్తంతో సహా మోసపోయిన తీరును పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందిస్తున్నారు. పూర్తి ఆధారాలు ఉన్న వారిని పోలీసులు తీసుకుని కేసులు నమోదు చేస్తున్నారు.



కళ్యాణదుర్గం పోలీసు స్టేషన్ వద్ద ఉన్న సంకల్ప సిద్ధి బాధితులు

మోసం ఇలా..

- ◆ సంకల్ప సిద్ధి మార్టులో రూ.1000 డిపాజిట్ చేస్తే రోజుకు రూ.10 కమీషన్, నెలలోపు రూ.300విలువ చేసే కిరాణ సరుకులు ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చు.
- ◆ రూ.లక్ష డిపాజిట్ చేస్తే రోజుకు రూ.1000 ప్రకారం 300రోజుల్లో రూ.3లక్షలు ఇస్తామన్నారు. తనఖాతా ద్వారా సభ్యులను చేర్పిస్తే అధనకంగా కమీషన్ జమవుతుంది.
- ◆ రూ.లక్ష చెల్లిస్తే రూ.లక్ష విలువైన బంగారం, ఇస్తామన్నారు. దీంతో పాటు రోజుకు రూ.100 చొప్పున 300 రోజులు రూ.30వేలు ఇస్తామని మొబైల్‌కు మేసేజ్‌లు పంపించారు.
- ◆ రూ.25 లక్షలు చెల్లిస్తే 25 ఎర్రచందనం మొక్కలతో కూడిన స్థలం ఇస్తామన్నారు. దీంతో 15 ఏళ్లలో రూ.1.75 కోట్లు వస్తాయని నమ్మబలికారు.
- ◆ రూ.5 లక్షలు చెల్లిస్తే సెంటు స్థలం, 300 రోజుల తరువాత రూ.25లక్షలు చెల్లిస్తామని చెప్పారు.


కళ్యాణదుర్గంలో ఫిర్యాదు చేయండి : డీఎస్పీ

అనంతపురం జిల్లా వ్యాప్తంగా సంకల్ప సిద్ధి మార్ట్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే తగిన ఆధారాలతో కళ్యాణదుర్గం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని డీఎస్పీ శ్రీనివాసులు తెలియజేశారు. ఈ మేరకు ఆయన గురువారం పటణ పోలీస్ సేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బాధితులు ఎవరున్నా వారు ఎంత మొత్తంలో డిపాజిట్ చేశారు.? ఎవరికి చెల్లించారు.? అన్న వివరాలను ఆధారాలతో సహా ఇవ్వాలన్నారు. ఇప్పటికే చాలా మంది ఫిర్యాదులు చేశారని, వాటిని పరిశీలిస్తున్నామని చెప్పారు. బ్రహ్మసముద్రం మండలం సుగేపల్లికి చెందిన నరేష్ రూ.3.16లక్షలు, పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు గోవిందరాజులు రూ.5లక్షలు మోసపోయినట్లు ఆధారాలతో సహా ఫిర్యాదు అందిందన్నారు. ఇంకా జిల్లాలో సంకల్ప సిద్ధి ద్వారా మోసపోయిన బాధితులెవరైనా ఉంటే ఆధారాలతో కళ్యాణదుర్గం సిఐ తేజోమూర్తికి ఫిర్యాదు చేయాలని డీఎస్పీ తెలియజేశారు.

'చెత్త' నిర్ణయం..!



- ◆ ప్రజలపై దొడ్డిదారిన పన్నుల భారం
- ◆ మహిళా సంఘాల ద్వారా తీర్మానం
- ◆ అధికారుల తీరుపై సిపిఎం ఆగ్రహం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రభుత్వం ప్రజలపై ఏదోక రూపంలో భారం మోపేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అయితే నేరుగా వేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్న ఉద్దేశంతో దొడ్డిదారిన మోపేందుకు సిద్ధమవుతోంది. ప్రజల అంగీకారం ఉందని చూపేందుకు కొత్తఎత్తు వేశారు. అనంతపురం నగర పాలక సంస్థలో మహిళా సంఘాల ద్వారా ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇది వరకే నగరంలో కొన్ని ప్రాంతాల్లో హౌస్‌టుహౌస్ చెత్తసేకరణ ప్రారంభం పేరుతో వలంటీర్ల చేత చెత్తపన్ను వసూలుకు ప్రయత్నాలు చేపట్టారు. దీనిపై ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. అప్పటి నుంచి కొంత వెనుకడుగు వేసినట్టు కనిపించారు. తిరిగి ఇప్పుడు చెత్తపన్ను వసూలుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఇంటికి రెండు చెత్త బుట్టలను అందజేశారు. పొడిచెత్త, తడిచెత్తకు వేరువేరుగా బుట్టలను పంపిణీ చేశారు.

మహిళా సంఘాల ద్వారా తీర్మానం

సాధారణంగా పన్నుల పెంపుదల తదితర అంశాలేమైనా ఉంటే నగర పాలక సంస్థ కార్యాలయంలో పాలకవర్గ సమావేశంలో చర్చించి తీర్మానం చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం పాలకవర్గమే కాకుండా మహిళా సంఘాల సభ్యులతో అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేసి హుటాహుటినా తీర్మానాలు చేయించారు. నెలకు రూ.30నుంచి రూ.60 వసూలు చేయాలని అందులో ఆమోదింపజేశారు. ఇది చూపించి ప్రజలు అంగీకరిస్తున్నారని చూపించి వచ్చే కౌన్సిల్‌లో చెత్తపన్నును ప్రజలపై రుద్దేందుకు సిద్ధపడుతున్నారన్న విమర్శలు పెద్దఎత్తున వెల్లువెత్తుతున్నాయి. దీనిపై పెద్దఎత్తున విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఆస్తిపన్నులను ప్రభుత్వం పెంచేసింది. ఇక చెత్త పన్నును ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేసేందుకు సిద్ధపడుతుండటం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం ఇటువంటి నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పన్నుల భారాలను తిప్పికొట్టండి : వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రజలపై ప్రభుత్వం మోపుతున్న భారాలను తిప్పికొట్టాలి. అంతటా ఒకేసారి పన్నువేస్తే వ్యతిరేకత వస్తుందని, దశల వారీగా ఒక్కో దగ్గర ఒక్కో రకమైన పద్ధతుల్లో భారం వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనంతపురం నగర పాలక సంస్థలో మహిళా సంఘాల ద్వారా అమలు చేయించే ప్రయత్నం చేయడాన్ని అందరూ వ్యతిరేకించాలి. దీనికి వ్యతిరేకంగా సిపిఎం చేపట్టే ఆందోళనల్లోనూ పాల్గొని తమ వ్యతిరేకతను తెలియజేయాలి.

'చెత్త' తీర్మానాలు చేయొద్దు

కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నాలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్ పరిధిలో చెత్త పన్నుల వసూలు కోసం డ్వాక్రా సంఘాల్లో తీర్మానం చేసి పంపే నిర్ణయాలను తక్షణం ఆపాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ఒకటవ నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అధికారులు, పాలక వర్గం తీరుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 'చెత్త' పన్ను వసూలు నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఒకటవ నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏదో ఒక పన్ను రూపేనా ప్రజలపై ఆర్థిక భారాలను మోపేందుకు కుట్ర చేస్తున్నాయన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, ఉపాధి లేమితో ప్రజల కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చెత్త పన్ను వసూలు చేయాలని నిర్ణయించడం సరికాదన్నారు. అనంతపురం నగరంలో ప్రయోగాత్మకంగా 4వ డివిజన్‌లో చెత్త పన్ను వసూలు చేపట్టిన సందర్భంగా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయ్యిందన్నారు. అప్పట్లో చెత్త పన్ను వసూలును నిలిపేస్తున్నట్లు కార్పొరేషన్ అధికారులు చెప్పారనన్నారు. కాగా ఇప్పుడు డ్వాక్రా గ్రూపుల ద్వారా చెత్తపన్ను వసూలుకు తీర్మానం చేయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ 'చెత్త' నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై మాట్లాడేందుకు కార్పొరేషన్ సెక్రటరీ సంఘం శ్రీనివాసులు, మేయర్ మహమ్మద్ వసీం ఆందోళనకారుల వద్దకు వచ్చిన వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. కమిషనర్ వచ్చి దీనిపై స్పష్టమైన హామీ ఇవ్వాలంటూ నాయకులు పట్టుబట్టారు. అనంతరం కమిషనర్ భాగ్యలక్ష్మి అక్కడికి చేరుకుని సిపిఎం నాయకులతో మాట్లాడారు. నగరంలో ప్రజలపై చెత్త పన్ను విధించడం లేదని, కేవలం సర్వీసు ఛార్జీ మాత్రమే వసూలు చేస్తున్నామని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. గడచిన నాలుగు రోజులుగా ప్రజలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ అంశంపై డ్వాక్రా సంఘాలతో సమావేశం నిర్వహించి ప్రజలకు పరిసరాలు పరిశుభ్రత నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు నుంచి వచ్చిన ఆదేశం మేరకు తాము కేవలం సర్వీసు ఛార్జీలను మాత్రమే వసూలు చేస్తున్నామని కమిషనర్ తెలియజేశారు. కమిషనర్ వివరణపై సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వీసు ఛార్జీలను కూడా ప్రజల జేబుల నుంచే డబ్బులు ఇవ్వాలని ఈ పేరుతో కూడా పన్నులు వసూలు చేసేందుకు వీల్లేదన్నారు. దీనిని మొండిగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తే ప్రజలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రకాష్, వలీ, వెంకటేష్, ప్రసాద్, రాజు, రజక సంఘం నాయకులు నాగభూషణం, రామాంజి, ఆటో యూనియన్ నాయకులు నిజాం, శివ, నాగరాజ, వన్నూరప్ప, ఇస్మాయిల్, బేబీ, సావిత్రమ్మ పాల్గొన్నారు.



అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసనలో మాట్లాడుతున్న వి.రామిరెడ్డి

బీసీలకు ప్రాధాన్యతనిచ్చింది టీడీపీనే

తెలుగుదేశం రాయలసీమ మీడియా కోఆర్డినేటర్ వెంకటరాముడు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బిసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది ఒక్క తెలుగుదేశం పార్టీనే అని టిడిపి రాయలసీమ కోఆర్డినేటర్ బివి.వెంకటరాముడు అన్నారు. వైఎస్ఆర్‌సిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య టిడిపి బిసి నాయకులపై చేసిన వాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు కాలువ శ్రీనివాసులుపై వైఎస్ఆర్‌సిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తప్పుడు విమర్శలు చేశారని మండిపడ్డారు. ఒకసారి చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. జిల్లాలో అత్యధిక మంది బిసీ ప్రజాప్రతినిధులు అవకాశం కల్పించింది టిడిపినే అన్నారు. మాజీ మంత్రి నిమ్మల కిష్టప్ప, జడ్పీ చైర్మన్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలుగా, నామినెటెడ్ పదవులు కల్పించి వాస్తవం కాదా అన్నారు. వైసిపిలో స్వేచ్ఛగా లేని మీరు మా నేతల గురించి మాట్లాడం హాస్యాస్పందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో కూడా బిసీలకు మంచి అవకాశాలు కల్పించేది టిడిపినే అన్నారు.

టిడిపి బిసీ సెల్ ఆధ్వర్యంలో

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలువ శ్రీనివాసులుపై వైఎస్ఆర్‌సిపి జిల్లా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను టిడిపి బిసిసెల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆవుల కృష్ణయ్య, పోతుల లక్ష్మీ నరసింహులు మండిపడ్డారు. టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో గాండ్ల కార్పొరేషన్ మాజీ ఛైర్‌పర్సన్ విశాలాక్షి, బిసిసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణస్వామి యాదవ్ తదితరులతో కలిసి వారు మాట్లాడారు. బిసిల పార్టీ టిడిపినే అన్నారు. ముందుగా వైసిపిలో బిసిలకు జరుగుతున్న భంగపాటును సరిచేసుకోవాలని సూచించారు.



విలేకరులతో మాట్లాడుతున్న బిసిసెల్ నాయకులు

పరిసరాలను ఆహ్లాదకరంగా మారుద్దాం

అనంతపురం కార్పొరేషన్ : నగరంలో అపరిశుభ్ర ప్రాంతాలను ఆహ్లాదకరంగా మారుద్దామని నగర మేయర్ మహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. నగరంలోని 10వ డివిజన్ పరిధిలోని కనకదాసు విగ్రహం సమీపంలో గతంలో ఎన్నో ఏళ్లుగా అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని స్థానిక కార్పొరేటర్ లక్ష్మీదేవి శుభ్రం చేయించారు. ఆ ప్రాంతంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, విజయభాస్కర్‌రెడ్డి లతో కలిసి గురువారం మొక్కలు నాటారు. ప్రజల సౌకర్యం కోసం బెంచీలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని వ్యక్తిగత శ్రద్ధతో కార్పొరేటర్లు శుభ్రం చేయించి ఆహ్లాదం కలిగించేలా మొక్కలు నాటి, కూర్చునేందుకు బెంచీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్పొరేటర్లు లక్ష్మీదేవి, బాబా ఫకృద్దీన్ లను స్ఫూర్తిగా తీసుకుని కార్పొరేటర్లు ప్రజల సహకారంతో పారిశుధ్యం మెరుగునకు ముందుకు రావాలని సూచించారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలన్నారు. జనసంచారం ఉండేచోట అపరిశుభ్రత కలిగించేలా వ్యవహరించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఇంటి వద్దకు చెత్తసేకరణకు వచ్చే పారిశుధ్య కార్మికులకు అందించి స్వచ్ఛ అనంతలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాబా ఫకృద్దీన్, కమల్ భూషణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుట్రా ఆంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రంగం ఆది వెడ్డింగ్ శిల్క్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక అంబేద్కర్ భవన్ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రంగం ఆది వెడ్డింగ్ స్టిల్స్ షోరూమును ఎమ్మెల్యే సోదరుడు వైసిపి నాయకులు అనంత చంద్రారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగం ఆది మాట్లాడుతూ అనంత ప్రజల ఆదరణతో నాణ్యమైన చేనేత పట్టు వస్త్రాలను అందించాలని నూతన హంగులతో షోరూంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ధర్మవరం ప్రాంతంలో అతిపెద్ద షోరూం ద్వారా వేల మోడల్స్ ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నాణ్యత నమ్మకం అంటే రంగం ఆది సిల్క్స్ అన్నట్లుగా ప్రజల ఆదరణ పొందామని తెలిపారు. ప్రజలు అందించిన చేయూత, ఆదరణతో అనంతపురంలో నూతన హంగులతో బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వేలాది చేనేత మగ్గాలపై మోడల్స్‌ను నాణ్యతతో ప్రజలకు అందించనున్నామన్నారు. ముఖ్యంగా వెడ్డింగ్ కలెక్షన్స్ ప్రత్యేకంగా తయారు చేస్తున్నామని చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, అధికారులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.



అనంత చంద్రారెడ్డిని సన్మానిస్తున్న షోరూము యజమానులు



కమిషనర్‌కి మొక్కను అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ మల్లెల లక్ష్మీదేవికి సచివాలయ ఉద్యోగులు గురువారం సన్మానం చేశారు. ఆమె నూతనంగా ఇన్‌ఛార్జి (ఎఫ్ఎసి) కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడంతో సచివాలయ సంక్షేమ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. పూల మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాల కార్మికులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సిఐటియు ఆధ్వర్యంలో డిపిఒ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 11వ పిఆర్‌సి ప్రకారం కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ గేటు ఎదుట గురువారం ధర్నా చేశారు. అంతకు ముందు స్థానిక కృష్ణ కళామందిర్ నుండి సుభాష్ రోడ్, సప్తగిరి సర్కిల్ మీదుగా ర్యాలీగా జిల్లా పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని కార్యాలయం ఎదుట బైఠాయించారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివప్రసాద్ అధ్యక్ష నిర్వహించిన ఈ ధర్నాలో ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓనల్లప్ప, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గోపాల్, సిఐటియు నగర కమిటీల కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, యూనియన్ గౌరవాధ్యక్షులు టి.గోపాల్ మాట్లాడుతూ..గ్రామ పంచాయతీలలో పనిచేసే స్వచ్ఛభారత్ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాలో దాదాపు 575 గ్రామ పంచాయతీలు ఉన్నాయన్నారు. వాటిలో సుమారు 5000 మందికి పైగా గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచకుండా, స్వచ్ఛభారత్ కార్మికులకు నెలలు తరబడి వేతనాలు చెల్లించకుండా వారితో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో రోజూ రోడ్లు, కాలువలు, శుభ్రపరుస్తూ, మంచినీరు, వీధిలైట్లు వెలిగిస్తూ ప్రజలకు అనేక రకాల పనులు చేస్తున్న కార్మికులు ప్రభుత్వానికి కనపడలేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు గడుస్తున్నా కార్మికుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. అందరికీ వేతనాలు పెంచిన ముఖ్యమంత్రి, గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ అమలుచేయాలని, మేజర్ పంచాయతీలలో ఆదాయాన్ని బట్టి 50 శాతం వేతనాలు కోసం నిధులు చెల్లించాలని గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలు చెబుతున్నాయన్నారు. అయితే ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా కార్మికుల జీవితాలు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలలో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వారికి సరైన వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటోందన్నారు. వారందరికీ కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిపిఒ కార్యాలయ ఏవో విశ్వనాథరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కమిటీల కార్యదర్శులు, వెంకట్ నారాయణ, ముత్తుజ, నాయకులు, రామాంజనేయులు, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు బాషా, నాగభూషణం, మధు, పెద్దన్న, రాజు, తిప్పారెడ్డి, నాగేంద్ర, రామాంజనేయులు, ఎర్రనాగప్ప తదితరులు పాల్గొన్నారు.



డిపిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులు

గ్రామీణులకు అందుబాటులో కెనరా బ్యాంకు సేవలు

అనంతపురం కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ లారెన్స్



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు సిబ్బంది

ప్రజాశక్తి-బెలుగుప్ప

గ్రామీణులకు సేవలందించడమే కెనరా బ్యాంకు ఉద్దేశమని అనంతపురం కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ లారెన్స్ అన్నారు. గురువారం బెలుగుప్ప మండలం నరసాపురం గ్రామంలో కెనరాబ్యాంకు 73వ శాఖ నూతన బ్రాంచిని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కెనరా బ్యాంక్ సేవలు అందించాలనే ముఖ్య ఉద్దేశంతో ఇక్కడ బ్రాంచిని ఏర్పాటు చేశామని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, బ్యాంకు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని బ్రాంచిల మాదిరిగానే లోను సౌకర్యం, డిపాజిట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ రాంప్రసాద్ రెడ్డి, సీనియర్ మనేజర్ పనింద్ర శర్మ, నాగరాజు రెడ్డి, కళ్యాణదుర్గం మేనేజర్ మోహన్, నరసాపురం నూతన మేనేజర్ విజయలక్ష్మి, ఫీల్డ్ ఆఫీసర్ ఫిరోజ్ ఖాన్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

17న పెన్షనర్ల దినోత్సవం

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఈ నెల 17వ తేదీన ఉదయం 10:30 గంటలకు పెన్షనర్ల భవనం వద్ద జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్షులు రామాంజనేయులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అందరూ హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి శ్రీ కృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాలలో క్రీడా పోటీలు

అనంతపురం : ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం 2022-23 సంవత్సరం అంతర్భాగ అనుబంధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులకు అంతర కళాశాలల స్థాయి క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, సాహిత్య విభాగాలలో పోటీలు నిర్వహించనున్నట్లు డీన్ పి.సాంబశివరావు తెలిపారు. ఈ నెల 16 నుండి 18వ తేదీ వరకు అనంతపురం శ్రీ కృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాలలో ఆటల పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థుల విభాగంలో టేబుల్ టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, క్యారంస్, చెస్, షటిల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 16 కళాశాలలకు నుండి 436 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొంటారాన్నరు. శుక్రవారం ఉదయం 9 గం.లకు ప్రారంభోత్సవ సభను నిర్వహిస్తామన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి, గౌరవ అతిథిగా డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డా. ఎ.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, విద్యార్థి వ్యవహారాల డీన్ డా. పి.సాంబశివరావు సభకు అధ్యక్షత వ్యవహరిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ బి.రవీంద్రనాథ రెడ్డి, యూనివర్సిటీ హెడ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రవికాంత్‌రెడ్డి, సహాయ ఆచార్యులు డా. జి.గోవర్ధన్, డా.నాగేశ్వరి, డా.దీప, కుమారి హేమశ్రీ లత పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై శిక్షణ

రాయదుర్గం రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు లబ్ధిదారులకు అందించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో కొండయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి ప్రణాళిక, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామస్థాయిలో ప్రణాళికల ఆవశ్యకతపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. మండలంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్స్, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు, వెలుగు సీసీలు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల విస్తరణ అధికారి రఘురామరావు, సీనియర్ అసిస్టెంట్ రవిచంద్ర ఆజాద్, మండల స్థాయి అధికారులు, రిసోర్స్‌పర్సన్స్ కొల్లప్ప, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి హయాంలో జీవన ప్రమాణాలు మెరుగు

మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్

ప్రజాశక్తి-గుత్తి

టిడిపి ప్రభుత్వ హయాంలోనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ పేర్కొన్నారు. గురువారం బేతాపల్లి గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జితేంద్ర గౌడ్ మాట్లాడుతూ ఒక్కసారి ఛాన్స్ ఇవ్వాలంటూ గద్దెనెక్కిన జగన్ ప్రజా సమస్యలను విస్మరించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రో, వంట గ్యాస్, విద్యుత్ ఛార్జీలు పెరగడంతో సామాన్యులపై భారం పడుతోందన్నారు. ఏపీ అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు మళ్లీ సీఎం కావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా సైకిల్ గుర్తుకు ఓటువేసి చంద్రబాబును సీఎం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.పవన్ గౌడ్, టిడిపి మండల పట్టణ కన్వీనర్లు బర్ధివలి, రవిశంకర్ గౌడ్, ఎంపీటీసీ ధనుంజయ, సర్పంచి భరత్, మాజీ సర్పంచి కె.నాగేంద్ర, నాయకులు మహ్మద్ అలీ, అగ్గిరాముడు, రమేష్, వంకాయల శీనా తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోతురాజు కాలువ గ్రామంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్ 3 ఇన్‌ఛార్జి ముంత నరేష్, క్లస్టర్ 4 ఇన్‌ఛార్జి బండి పరుశురాం, యూనిట్ ఇన్‌ఛార్జి శివయాదవ్, నాయకులు శంకరయ్య, దాసరి గంగాధర, ఆదినారారణ, మైనార్టీ సెల్ పార్లమెంట్ కార్యదర్శి మహమ్మద్ గౌస్, శింగనమల బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న జితేంద్ర గౌడ్



జెఎన్‌టియులో నివాళి అర్పిస్తున్న దృశ్యం

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిపాలనా భవనంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి రెక్టార్ ఆచార్య విజయకుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్, యూనివర్సిటీ ఉన్నతాధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ డైరెక్టర్లు ఆచార్య వి.సుమలత, ఆచార్య ఇ.కేశవరెడ్డి, ఆచార్య వసుంధర, ఆచార్య ఈశ్వరరెడ్డి, ఆచార్య కిరణ్మయి, ఆచార్య భువన విజయ, ఆచార్య పద్మ సువర్ణ, ఆచార్య ఎ.సురేష్ బాబు, ఆచార్య సి.శోభా బిందు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆ సంఘ అధ్యక్షులు జయంతి సురేష్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సుదర్శన్, సరస్వతి, అనిత, రమేష్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర్ నాయుడు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ దొడగట్ట నారాయణ, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు డిస్ మురళి, పట్టణ ప్రధాన కార్యదర్శి తలారి సత్తెప్ప, విక్కీ, గోవిందరాజులు, కామక్కపల్లి నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జయం విశ్వనాథ్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌక్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గోపీనాథ్, వాసు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రెండవ రోజూ జనసేన శ్రమదానం

శిథిలమైన రహదారులకు మరమ్మతులు

ప్రజాశక్తి-అనంతపురం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో అనంతపురం జిల్లా అధ్యక్షులు, అర్బన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి టిసి.వరుణ్ ఆధ్వర్యంలో చేపట్టిన శ్రమదానం ద్వారా గుంతలు పడ్డ రహదారుల మరమ్మతు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. రెండవ రోజు గురువారం అనంత అర్బన్ నియోజకవర్గం పరిధిలోని ఎస్‌బిఐ కాలనీ పార్క్, జెఎన్‌టియు కాలేజ్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో శిథిలమైన రహదారులకు జనసేన నాయకులు కంకర పొడి, సిమెంట్ వేసి గోతులను పూడ్చి చదును చేశారు. సంవత్సరాల తరబడి గుంతలు పడ్డ రోడ్లపై ప్రయాణం చేయలేక ఇబ్బంది పడ్డామని.. ఫోన్ చేసిన 24 గంటల్లోనే జనసేన నాయకులు స్పందించి రహదారులు బాగు చేయడం పట్ల స్థానికులు శ్రీనివాస్, జెఎన్‌టియు విద్యార్థులు జనసేన పార్టీకి, కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్బన్ ఇన్‌ఛార్జి టిసి.వరుణ్‌కి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర మాట్లాడుతూ... నగర ప్రజలకు ఏ సమస్య వచ్చినా జనసేన పార్టీ ముందుండి పోరాడుతుందన్నారు. అర్బన్ ఇన్‌ఛార్జి టిసి.వరుణ్ నాయకత్వంలో శ్రమదానం కార్యక్రమాన్ని విస్తృతస్థాయిలో నిర్వహించి కళ్లుండీ చూడలేని ఈ వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, నగర కార్యదర్శులు మురళి, నెట్టిగంటి హరీష్, పవన్, నాయకులు పవనిజం రాజు, చరణ్, వడ్డే వెంకటేష్, తోట మోహన్, మల్లి, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్న జనసైనికులు

నేరాలు ఘోరాలు

రేషన్ బియ్యం పట్టివేత

పుట్లూరు : మండలంలోని మడ్డిపల్లి క్రాస్‌వద్ద బొలోరో వాహనాన్ని తనిఖీ చేసి 45 బ్యాగుల (50 కిలోలు) రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. తాడిపత్రి పట్టణానికి చెందిన జూటూరు రామాంజనేయులు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. తాడిపత్రి, పుట్లూరు మండలాల్లోని పరిసర గ్రామాలలో ప్రజల నుండి తక్కువ రేటుకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి, ముదిగుబ్బ, అనంతపురం పట్టణాలలోని హోటళ్లకు అక్రమంగా తరలిస్తున్నారన్నారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

చోరీ ఆభరణాలు స్వాధీనం

పెద్దపప్పూరు : పెద్దపప్పూరు మండలం సి.చిక్కేపల్లి గ్రామంలోని పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో చోరీ చేసిన వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాత్రి ఆలయంలోని వెండి ఆభరణాలను దుండగులు చోరీ చేసి ద్విచక్రవాహనంపై తీసుకెళ్లారు. అదే సమయంలో అటువైపుగా ఎస్ఐ ఖాజాహుస్సేన్ జీపులో రావడంతో దొంగలు ద్విచక్రవాహనాన్ని ఓ తోట వద్ద వదిలి పారిపోయారు. పోలీసులు ద్విచక్రవాహనాన్ని స్వాదీనం చేసుకుని పరిశీలించగా అమ్మవారి వెండి ఆభరణాలు లభ్యమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సంఘాల ధర్నా

సిఐటియు, సిపిఎం మద్దతు

నార్పల : వెలుగు మహిళా సంఘాలకు రుణమాఫీ చేయాలని నార్పల మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం ఎదుట మహిళా సంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ఈ ధర్నాకు సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు, మండల కార్యదర్శి బండి చంద్రమౌళి, సిపిఎం మండల కార్యదర్శి కుల్లాయప్ప మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా మహిళా సంఘాలకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం దానిని విస్మరించిందన్నారు. ఇప్పటికైనా స్థానిక అధికారులు స్పందించి నార్పల మండలంలో రుణమాఫీ కాని సంఘాలన్నింటికీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎపిఎం తిప్పమ్మకు వినతిపత్రం అందజేశారు. చేనేత సంఘం నాయకులు రాజు, ఆవాజ్ మండల కార్యదర్శి ఖజామొహిద్దీన్, షరీఫ్, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

హాకీలీగ్ టోర్నమెంట్‌లో నార్పల విద్యార్థుల సత్తా

నార్పల : అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించిన అండర్-15 హాకీలీగ్ టోర్నమెంట్‌లో నార్పల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచినట్లు పాఠశాల పీడీ శ్రీనివాస్, పిఇటి శ్రీదేవి తెలిపారు. విద్యార్థినులను ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

విజ్ఞాన్ పాఠశాలను సీజ్ చేయాలి

గుంతకల్లు : విద్య ముసుగులో ఫీజుల రూపంలో దోపిడీకి పాల్పడుతున్న విజ్ఞాన్ ప్రయివేటు పాఠశాలను జిల్లా విద్యా శాఖ ఉన్నతాధికారులు సీజ్ చేయాలని ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి వెంకట్ నాయక్, నియోజకవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ ఎఐఎస్ఎఫ్ నాయకులు పాఠశాల ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విజ్ఞాన్ పాఠశాలలో ఉన్నత విద్య తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వ అనుమతులు లేకున్నా యాజమాన్యం విద్యార్థులతో అడ్మిషన్ చేయించుకుని వేలాది రూపాయల దోపిడీకి పాల్పడుతోందన్నారు. పట్టణంలో అనుమతులు లేని విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు శ్రవంత్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

గార్లదిన్నె : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బాల్య వివాహాలు, రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రతపై గురువారం అవగాహన కల్పించినట్లు జిల్లా బిసిసిసి జిల్లా సమన్వయకర్త కె.నాగేంద్ర తెలిపారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు, బాల్య వివాహాలు చేస్తే ఎలాంటి శిక్షలు పడతాయి అనే విషయాలపై అవగాహన కల్పించారు. కిశోరబాలికల్లో కలిగే రక్తహీనత, వాటి వలన జరిగే నష్టాలు, బాలికల వ్యక్తిగత పరిశుభ్రతను పవర్ పాయింట్ రూపంలో విద్యార్థినులకు వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో లబ్ధి

రాయదుర్గం రూరల్ : ప్రభుత్వ పథకాలతో అర్హులకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 31, 32 వార్డుల్లో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాళు శిల్ప, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్లు శ్రీనివాసులు, వలీబాషా, కౌన్సిలర్లు భాగ్య, దేవరాజు, గోవిందరాజులు పాల్గొన్నారు.

సచివాలయాల పరిశీలన

పుట్లూరు : మండలంలోని పుట్లూరు, తక్కల్లపల్లి గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ యోగానందరెడ్డి గురువారం పరిశీలించారు. పుట్లూరు సచివాలయంలో కొత్త పింఛను దారుల దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఆయన తక్కల్లపల్లి సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

శాశ్వత భూహక్కు సర్వేపై అవగాహన

ఆత్మకూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శాశ్వత భూ హక్కు, భూ రక్షణ సర్వేపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతపురం డివిజనల్ పంచాయతీ అధికారి సుమన జయంతి ఎఒ సోమశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, ఇంజినీరింగ్ సహాయకులకు జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా సర్వేపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి సత్యబాబు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

20న గూగూడులో చక్కెర వేలంపాట

నార్పల : గూగూడు గ్రామంలోని కుళ్లాయిస్వామి ఆలయ ఆవరణంలో ఈ నెల 20వ తేదీన కుళ్లాయిస్వామికి భక్తులు సమసర్పించిన చక్కెరకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాణాధికారి శోభ, పాలకవర్గ ఛైర్మన్ శివశంకర్‌రెడ్డి తెలిపారు. దేవాదాయ శాఖ కార్యాలయంలో డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. దేవాదాయ శాఖ నిబంధనల మేరకు వేలం పాట నిర్వహిస్తామని చెప్పారు.

రబీ పంటకు ఈ క్రాప్ నమోదు

పుట్లూరు : రబీలో సాగుచేసిన పంటలను ఈ-క్రాప్ ద్వారా పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి కాత్యాయని రైతులను కోరారు. 2022-23లో సాగు చేసిన ప్రతిను పంటను తప్పనిసరిగా ఈ-క్రాప్ నందు నమోదు చేయాలన్నారు. ఇతర వివరాలకు గ్రామ వ్యవసాయ శాఖ అధికారిని గాని, ఉద్యాన అసిస్టెంట్‌ను గాని సంప్రదించాలని కోరారు.

జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరం

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ -1 ప్రోగ్రామ్ ఆఫీసర్ గోవర్ధన్ ఆధ్వర్యంలో నాలుగవ రోజు విద్యార్థులు స్వచ్ఛంద సేవ చేశారు. గురువారం 74 ఉడేగోళం గ్రామంలో ప్రధాన రహదారి కిరువైపులా, ఆర్టిటీ ప్రాంతీయ కార్యాలయం పరిసరాలను వాలంటీర్లు పరిశుభ్రం చేశారు. ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, సర్పంచి దుర్గమ్మ, సందర్శించి వాలంటీర్లను అభినందించారు.